

# చదువు

ఇచ్ఛాపురపు రామచంద్రం

ఆ వూరు పల్లెటూరు కాదు. ఎందుకంటే అక్కడ మనిషి ఒకచోటు నుంచి మరొక చోటుకి చేరాలంటే మామూలుగా నడవలేనంత దూరం పైగా-అక్కడి మనుషులకు పక్కవారి గురించి పట్టించుకునే కుతూహలం తక్కువ ఇక దాన్ని పల్లెటూరని ఎలా అనగలరు?

ఆ వూరు-పట్నమూ కాదు. ఎందుకంటే అక్కడ డబ్బుతో సాధించలేని విషయాలింకా కొన్ని మిగిలి ఉన్నాయి. మనుషులు పూర్తిగా యాంత్రికం అయిపోలేదు. కొన్ని యిళ్లకు వీధి అరుగులున్నాయి. పైగా అక్కడ రిక్షాలే తప్ప ఆటోలూ. టాక్సీలూ లేవు. కాలం విలువ తెలియని మనుషులున్నారు.

ఆ త్రిశంకు గ్రామంలో-పట్నం నుంచి వచ్చే బస్సు ఆగింది.

ఆగిన బస్సునుంచి ఓ యువకుడు దిగాడు. అతని ముఖం చూస్తూంటే అతని కా వూరు రావలసి రావడంచాలా అయిష్టంగా ఉన్నట్లుంది.

బస్సు ఆగడమే కాఫీ విలాస్ ముందు ఆగింది.

అతను-బస్సు దిగడమే తడవుగా కాఫీ హోటల్లో దూరాడు.

విసుక్కుంటూ కుర్చీ నొకదాన్ని ఆక్రమించుకున్నాడు.

ఇస్సురని నిట్టూర్చాడు.

ఎదుట నిలిచిన సర్వర్‌ని—"కాఫీ" అని కసురుకున్నాడు.

అయిష్టంగా కాఫీ అందుకుని-ఆలోచిస్తూనే ఒక్కొక్క గుక్క పీల్చసాగాడు. కష్టపడి తాడి చెట్టెక్కి-తే—తీరాచేసి యీతపండు మాత్రమే దొరికినట్లుందతనికి. ముఖం నిండా అలసటా, అసంతృప్తి ఆవరించి ఉన్నాయి. మళ్ళీ-ఆమాత్రమయినా అందుకున్నానన్న ఆశ కూడా రేఖామాత్రంగా లేకపోలేదు. అ సంతోషానికి—చిరాకూ అసంతృప్తి రాహుకేతువుల్లా గ్రహణం పడుతున్నాయి.

అతని పేరు ఆనంద్.

వయస్సు పాతిక పైచిలుకు.

అర్హత-ఆర్థికశాస్త్రంలో ఎమ్మే

అన్వేషణ-ఉద్యోగార్థం.

కార్యార్థుడై పట్నంనుంచి త్రిశంకు నగరానికి వచ్చాడతగాడు. ఎండ తగలని చోట పెరిగిన మొక్కలా అతను సుకుమారంగా సున్నితంగా కనిపిస్తున్నాడు. లేదా, బలహీనంగా కనిపిస్తున్నాడు. పాతిక పూర్తిగా దాటకుండానే కళ్ళజోడు పెట్టుకున్నాడు. దళసరి అద్దాల ఆ కళ్ల జోడు అతని అసలు వయస్సుకి అదనంగా మరో పదేళ్లని జోడించి చెబుతుంది.

తాగిన కాఫీకి డబ్బు చెల్లిస్తూ—"సెయింట్ లూథర్ కాన్వెంట్ ఎంత దూరం?" అని అడిగాడు.

"ఉంటుంది-మైలున్నరా, రెండు మైళ్లు..." పైసలను సొరుగులోకి తోస్తూ చెప్పాడు హోటలువాడు.

ఆనంద్ వాచీ చూసుకున్నాడు. ఎనిమిదిన్నర.

హోటలు బయటకు వచ్చి రిక్షా కోసం రోడ్డుమీద చూశాడు.

మచ్చుకయినా ఒక్కటీ కనిపించ లేదు. అతని గుండెల్లో బండ పడింది.

"ఈ వూళ్ళో రిక్షాలుండవా?" ఎవరినో అడిగాడు.

"రోజూ ఉంటాయి. ఇవాళ ఉండవు."

"ఏం?"

"నిన్నరాత్రి బస్‌డ్రయివర్లకీ రిక్షా వాళ్ళకీ గొడవొచ్చిందట. ఇవాళ రిక్షా వాళ్లు సమ్మె చేస్తున్నారు. అది తేలే వరకూ బళ్లు బయటకు తియ్యరు రిక్షా వాళ్లు."

"మరెలా? ఇక్కడ టాక్సీలు కానీ, ఆటోలు కాని ఉండవా?"

జవాబుగా ఓ నవ్వు నవ్వేశాడతను. ఆనంద్‌కి తన అజ్ఞానం తెలిసివచ్చింది.

ఆనంద్‌కి మతిపోయింది.

మైలున్నర-రెండుమైళ్లు! ఎలా తరించడం?

ఎనిమిదిన్నరకే ఎండ ఎర్రగా చుర్రుమనిపిస్తూంది. ఐదు నిముషాలు ఆ

ఎండలో నిలబడిత చాలు నిలువెల్లా చెమట పట్టేసేటట్లుంది.

ఆనంద్‌కి ఆత్రుతగా ఉంది, ఆగ్రహం గానూ ఉంది.

మాట్లాడితే సమ్మె. ఛీ ఛీ. ఈ దేశం యింకేం బాగుపడుతుంది ?

ప్రధానమంత్రికి పర్సనల్ లెటర్ వ్రాసేద్దామన్నంత కోపంగా ఉన్నాడతను. ఐక్కప్రాణికి కోప మెక్కువ. పైగా—వెళ్లవలసింది ఉద్యోగం కోసం. అసలే అది ఇంగ్లీషువాళ్ల కాన్వెంటు. టైమంటే టైమే. అరనిముషం ఆలస్యమయినా—"ఇంత అశ్రద్ధ మనిషివి ఉద్యోగం ఏంచేస్తావ్ ? పిల్లలు ఆలస్యంగావస్తే శిక్షించవలసినది టీచరు, ఆ టీచరే ఆలస్యంగా వస్తే ?" అని ఉద్యోగం లేదు ఇంటికివెళ్లు అని తీరిగ్గా అనేస్తారేమో ?

ఎలా ?

దొరక్క దొరక్క దొరికిన అవకాశం.

అంతా అయిపోయినట్లే. ఒకసారి ప్రిన్సిపాల్ ఇంటర్వ్యూ చేసి ఉద్యోగం యిచ్చేస్తాడు. ఈ అవకాశం పోగొట్టుకుంటే యిక జీవితంలో ఉద్యోగ ప్రాప్తి ఉండకపోవచ్చును. ఏదీ లేకపోడం కన్నా ఏదోఒకటి ఉండడం నయంకద ?

కాన్వెంటుకి వేళకి చేరుకోడం ఎలా ?

ఎంత చిత్రమయిన—దయనీయమయిన పరిస్థితి. నూరుమైళ్ళ దూరం మూడు గంటలలో ప్రయాణం చెయగలిగిన తను—మైలున్నర రెండు మైళ్ల దూరం గంటలో చేరుకోగలడో లేడో తేలకపోవడం ఎంత హాస్యాస్పదం !

ఈ విషమ పరీక్ష ఏమిటి చివరి వరకూ వచ్చాక !

భగవంతుడు కరుణించి...తనను అడంగులు చేర్చరాదూ !


ఐనా ఆ దొరలు మరీని. కాన్వెంటు కాస్తా రోడ్డు పక్క కట్టడం మానేసి బస్సులు పోని అడవిలాటి చోటులో కట్టడ మెందుకూ, తన కర్మ కాకపోతే!

మైలున్నర—రెండు మైళ్లు...ఎంత దూరం !

కొన్నివేల కోట్ల మైళ్ళు ప్రయాణించగలిగే రాకెట్ల గురించి చక్కని పరిజ్ఞానమే ఉంది ఆనంద్‌కి. కాని-యీ మైలున్నరా రెండు మైళ్ళూ మాత్రం అతనికి చాలా యిబ్బంది అయిపోయి మనిషిని చిత్రహింస చేసెయ్యసాగాయి.

అతని నడకమీద అతనికే విశ్వాసం లేదు. ఔను అతను నగరవాసి. దూరపు నడకలు ఎరిగినవాడు కాదు. పుట్టడమూ పెరగడమూ పట్నంలోనే. మరెక్కడా ఉద్యోగావకాశం లభించకపోబట్టి కాని లేకపోతే అతనీ త్రిశంకు గ్రామానికి ఎంతమాత్రమూ వచ్చేవాడు కాదు. తీరా వచ్చాక యిలా జరుగుతూంది.

నాలుగు గజాలు నడిచి ఆగిపోయాడు.



కళ్ళు పెద్దవిచేసి చూశాడు

రోడ్డు చివర రిక్షా !

ఆత్రుతగా పరుగెత్తాడు.

రిక్షావాడు బన్ తింటున్నాడు-తీరిగ్గా.

అతను టీ తాగేవరకూ ఆగాడు ఆనంద్.

"రావోయ్...కాన్వెంటు కేం తీసుకుంటావ్ ?"

"రాలేను బాబూ."

"ఫరవాలేదు. రా. మామూలుకంటె మరో పావలా ఎక్కువిస్తానులే."

"మీ కివాళ గాడీ దొరకదు. వాళ్లంతా సమ్మె చేస్తున్నారు."

"మరి—నువ్వు బండి తెచ్చావుగా ?"

కొత్తమనిషివా అన్నట్లు చూశాడు రిక్షావాడు. "ఇది కిరాయి బండి కాదండి."

"ఐతే ఏంతే...రా, రా...రెండు రూపాయలు తీసుకో." తొందరపెట్టాడు ఆనంద్ డబ్బుకి లొంగని మనిషుండడని ఆనంద్ అభిప్రాయం. డబ్బులో ఆ మాజిక్కుంది. నీతి నియమాలూ,

ఆదర్శాలూ అన్నీ డబ్బుదగ్గర కొచ్చే సరికి హుష్ కాకీ ఐపోతాయి.

కాకపోతే తనీ ఉద్యోగాని కెందుకు వస్తాడు?

ఎమ్మే ఎకనమిక్స్ ఫస్ట్‌క్లాసు, కనీసం కాలేజీ లెక్చరరు కావాలి. అలాటిది— కాన్వెంట్ టీచరుగా చేరేందుకు సిద్ధపడ్డా డంటే కారణం—డబ్బు. అది సంపాదించకపోతే బ్రతుకు గడవదు.

"రెండు కాదు ... రెండు పదులిచ్చినా రాలేను బాబూ!"

"అంత ముఖ్యమయిన పనేమి టోయ్?" ఆశ్చర్యంగా అడిగాడు ఆనంద్.

రిక్షావాళ్ళకి కూడా ముఖ్యమయిన పనులుంటాయా? ఉంటే మాత్రం అవి డబ్బుకంటె ముఖ్యమా?

"నావి నెల బేరాలండి. వేళకి వెళ్ళక పోతే దేంజరై పోతాది—" అన్నాడు.

ఆనంద్ పరీక్షగా చూశాడు రిక్షా వాడు కుర్రవాడే ఇరవయ్యేళ్ళకి మించి ఉండవు. అందుకే అంత పట్టుదల... సిన్సియారిటీ...

"ఒక పూటకి కొంప మునిగిపోతుం దటయ్యా? అయినా-నన్ను దింపేసి వచ్చి..."

"లాభంలేదండి."

"అనవసరంగా మూడ్రూపాయలు వొదిలేసుకుంటావా!—" నవ్వాడు ఆనంద్.

"మూడ్రూపాయలంటే నాలుగు సినిమాలు—" హెచ్చరించాడు నోట్లు పైకి తీస్తూ.

"వొద్దండి-"

ఈసారి ఆనంద్‌కి చాలా కోపం వచ్చింది. డబ్బుకి లొంగని రిక్షావాడు పరమ మొండిగా కనిపించాడు.

"ఇంతకీ అంత ముఖ్యమయిన పనే మిటోయ్? వందలు చేసే వ్యవహారమా, వేలు చేసే వ్యవహారమా?"

"నలుగురు పిల్లల్ని కాన్వెంటు బడికి తీసుకెళ్ళాలండి."

"బడికేనా!" నవ్వాడు. "ఓ పూట బడి పోయినంత మాత్రాన కొంప మునగదు లేవోయ్."

"ఓ పూట మాత్రం ఎందుకు పోవా లండీ? నా డబ్బుల కక్కుర్తికోసం పిల్లల చదువు పాడుసెయ్యడం ఏం న్యాయం?"

"నన్ను దింపేసి వచ్చి – పిల్లల్ని తీసుకెళ్ళు."

"వాళ్ళు కాలీసెం అయిపోతాదండి."

"కొంచెం ఆలస్యమయినా బాధ లేదు"

"బాబోయ్! అది ఇంగిలీసు బడండి. వేళ కెళ్ళకపోతే లోపలికి రానివ్వరండి. మరి నన్నొదిలేయండి. నాకు వేళయి పోతూంది. పిల్లలు చూస్తూ ఉంటారు"

కొరకరాని కొయ్య

డబ్బు విలువ తెలియని మూర్ఖుడు.

కోపం తారస్థాయినందుకుంది ఆనందులో. కాని కోప తాపాలను ప్రదర్శించేందుకు అనువైన సమయం కాదని నిగ్రహించుకున్నాడు.

"ఐదురూపాయలు వదిలేసుకుంటా వన్నమాట!" చిరునవ్వు నవ్వుతూ చూశాడు " చదువుకంటే కూడా డబ్బు విలువైనదోయ్ చదువు విలువ డబ్బులోనే..."

"చదువుకున్నవారు తమరలా చెబితే నేనేం చెప్పగలనండి? కాని-ఎవరి వెర్రి వాళ్ళ కానందం. ఒక్కమాట చెప్పనీండి నన్ను. డబ్బు ఎప్పుడయినా ఎలాగయినా సంపాదించొచ్చు చదువు మాత్రం తగిన వయసులోనే తప్ప రావండి. నాకలాగే అయిందండి అమ్మా, అయ్యా చిన్నప్పుడు బళ్ళో వేశారు కారు. పెద్దయ్యాక పలకా బలపమూ పట్టుకుంటే-చచ్చి గింజుకున్నా అక్షరమ్ముక్క వొచ్చింది కాదండి.

"నా కోరిక తీర్చుకుందుకు ఒకటే దారి కనిపించింది. నలుగురు పిల్లల్ని బడికి తీసుకెళ్ళేందుకు నెలబేరా లొప్పుకున్నాను. వాళ్ళెక్కేసరికి నా బండి కలకల లాడుతుంది. బండిలో పిల్లలు పద్యాలూ, పాటలూ పాడతారు. పాఠాలు చదువుతారు. అప్పజెప్పుకుంటారు. వాళ్ళు అలా ఉషారుగా చదువుకుంటూంటే నాకు వెర్రి ఆనందం. నా పిల్లల్ని నేను చదివించుకుంటున్నట్టే అనిపిస్తుంది. నేను చదువుకోలేదన్న విచారం మరచిపోతాను."

"బాగుంది. నేను ఎమ్మే ఫస్టుక్లాసులో పాసయ్యాను ఏం లాభం? రెండువందల రూపాయల జీతంకోసం సిద్ధపడి వచ్చాను చదువుకి విలువేముంది? ఈ మాత్రం సంపాదన ఏ వృత్తి చేసుకున్నా రాకపోదు."

"చదువు విలువ చదువుకోనివాడికే తెలుస్తుందండి. ఇంతకీ తమరేం ఉద్యోగం చేస్తున్నారండి?"

"నువ్వు బండిలో పిల్లల్ని బడివరకూ తీసుకెళ్తావు. నేను-వాళ్ళకి బడిలో పాఠాలు చెప్పాలి..."

"మీరు-బడిలో మాస్టరుగారా! మిమ్మల్నెప్పుడూ చూసినట్టులేదు."

"ఉద్యోగంలో చేరాలని వచ్చాను యిప్పుడే. వేళకి వెళ్ళకపోతే లాభం లేదు. ఇక్కడేమో నా దురదృష్టంకొద్దీ రిక్షాలు లేవు. చూడగా యీ ఉద్యోగం నాకు దొరికేటట్టు లేదు." దీనంగా అన్నాడు ఆనంద్.

"ఐతే మీరు కొత్త టీచరన్న మాట! ముందే చెప్పారుకారేం? రండి రండి. బండెక్కండి. మిమ్మల్ని పిల్లలతోపాటు బళ్ళో దింపేస్తాను." రిక్షావాడి ముఖం చాటంతయింది. ఆనంద్ ముఖం సంతోషంతో రిలీఫ్‌తో వికసించింది.